క్లుప్తంగా

తుపాను బాధితులకు నిత్యావసరాల పంపిణీ



లక్కవరంలో నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్: తుపాను ప్రభావంతో లక్కవరంలో ఇల్లు కూలి నిరాశ్రయులైన కుటుంబాలకు ప్రభుత్వం నిత్యావసరాలను అందజేసింది. నిరాశ్రయులైన ఉండి గంగరాజు, చీరాల గంగ, మాదాసు సత్యవతి, దల్లి ముసలమ్మ, నాగిన్ కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా ఒక్కో కుటుంబానికి 25 కేజీల బియ్యం, నూనె, కందిపప్పు అందజేశారు. సర్పంచ్ గెల్లా వెంకట రమణ చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. సివిల్ సప్లై డీటీ లక్ష్మి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాధరెడ్డి, పెన్నాడ రాంబాబు, నంబూరి వీరయ్య, ఆరుగొల్లు రాంబాబు, దల్లి నాగేశ్వరరావు, నంబూరి శ్రీను, వీరబ్రహ్మం, జోగయ్య పాల్గొన్నారు.

కుక్కునూరు ఎస్సైగా రామకృష్ణ బాధ్యతల స్వీకరణ



రామకృష్ణ, ఎస్సై

కుక్కునూరు: కుక్కునూరు ఎస్సైగా రామకృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరు వన్‌టౌన్ ఎస్సైగా పని చేస్తున్న రామకృష్ణను ప్రభుత్వం కుక్కునూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేసింది. ఇక్కడ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు రాజీ లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు

కుక్కునూరు: ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వులు చిందించడానికి సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఏపీఎస్‌ఐఆర్‌డీ ప్రాజెక్టు డైరెక్టర్ జె.మురళీ అన్నారు. శనివారం కుక్కునూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు నిర్వహిస్తున్న రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. శిక్షణ తరగతులు సిబ్బందికి ఏ విధంగా ఉపయోగపడ్డాయో తెలుసుకున్నారు. ప్రతి ఉద్యోగి సమష్టిగా పనిచేసి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ వై.దోసిరెడ్డి, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ ప్రసంగిరాజు, ఎంపీడీవో శ్రీనివాస్, ఈవోపీఆర్‌డీ, రీసోర్సు పర్సన్‌లు హార్ట్‌ఫుల్‌నెస్ ట్రైనర్ అప్పారావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

జంగారెడ్డిగూడెం: ఉప్పలమెట్ట వాసవి క్లబ్ కపుల్స్ 2024 నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుళ్ళపుడి మురళికృష్ణ, కార్యదర్శిగా కొనకళ్ళ సత్యనారాయణ, కోశాధికారిగా బూర్లగడ్డ వీరవెంకట సత్యనరాయణ, మరికొందరిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ మేరకు సభ్యులకు నియామక పత్రాన్ని క్లబ్ చార్టర్ అధ్యక్షుడు గుడిమెట్ల కుమార్ అందజేశారు. కార్యక్రమంలో 2024 రీజనల్ చైర్మన్ చిన్నిసాయి, ఉప్పలమెట్ట వాసవీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొల్లిపర ఆనంద్, పూర్వాధ్యక్షుడు ఉమ్మడి బాలభాస్కర్, ఓలేటి కృష్ణకుమార్, క్లబ్ సభ్యులు నాగవరపు పుల్లారావు, గుడిమెట్ల యుగంధర్ తదితరులు పాల్గొన్నారు

శ్రీవారి సేవలో జంగారెడ్డిగూడెం ఆర్డీవో



శ్రీవారి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆర్డీవో అద్దయ్య దంపతులు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయాన్ని జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య శనివారం సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు.

పూర్వ విద్యార్థుల నివాళి



రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఎబినైజర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పూర్వ విద్యార్థులు

కొయ్యలగూడెం: ప్రభుత్వ జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ దిద్దే ఎబినైజర్ మృతి పట్ల పూర్వ విద్యార్థులు నివాళి అర్పించారు. కొయ్యలగూడెంలోని ఆయన నివాసానికి పలువురు పూర్వ విద్యార్థులు చేరుకొని ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన స్మృత్యర్థం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని అన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 667 కేసుల పరిష్కారం



చింతలపూడి: సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు



జంగారెడ్డిగూడెం: జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి: చింతలపూడి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 667 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. వాటిలో 53 క్రిమినల్ కేసుల్లో రూ.2,50,000, 9 సివిల్ కేసుల్లో రూ.17,71,400, 7 చెక్ బౌన్స్ కేసుల్లో రూ.3,90,000, ఒక డీవీసీ కేసులో రూ.5 లక్షలు, 33 మద్యం కేసుల్లో రూ.2,20,230, 551 న్యూసెన్స్ కేసుల్లో జరిమానా క్రింద రూ.2,50,660, 3 టెలిఫోన్ బకాయి కేసుల్లో రూ.3,835 వసూలు చేసి కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సులో లోక్‌అదాలత్ వల్ల కలిగే ఉపయోగాలను గురించి వివరించారు. ఇరుపక్షాలు రాజీ పడటం ద్వారా ఇరుపక్షాలు గెలిచినట్లేనని చెప్పారు. మానవ హక్కులను గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీపీ వి.సామయ్య, సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు, ఎల్‌వీ చైతన్య, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలి, న్యాయవాదులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం న్యాయస్థానాల ప్రాంగణంలో శనివారం జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కక్షిదారులు కేసులను పరిష్కరించుకున్నారు. ఈ సందర్భంగా కిషోర్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో మొత్తం 438 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. ఆయా కేసులకు సంబంధించి రూ. 52,74,033 మొత్తం బాధితులకు అందజేయడం జరిగిందన్నారు. ఐపీసీ 51 కేసులు, ఎక్సైజ్ 54 కేసులు, చెక్ బౌన్స్ కేసులు 21, మనోవర్తి కేసులు 1, సివిల్ 7 కేసులు, బెంచి కోర్టు కేసులు 296, బీఎస్‌ఎన్‌ఎల్‌కు సంబంధించి 8 కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కేఎస్‌ఆర్ తేజస్విని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.శ్రీనివాసరావు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

జంగారెడ్డిగూడెం: చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా పుట్టినరోజు సందర్భంగా స్థానిక సీతామహాలక్ష్మి వృద్ధాశ్రమంలో శనివారం రాత్రి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యూత్ జిల్లా అధ్యక్షుడు పడమటి గిరిబాబు గౌడ్, సీనియర్ నాయకులు బత్తిన చిన్న, గంజి వినోద్, నేకూరి కిషోర్, పెప్సీ శ్రీను, పందిరాజా, కంచుమర్తి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వర్జీనియా పొగాకు రైతులను ఆదుకుంటాం

పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



సీతంపేట సమీపంలోని పొగాకు తోటలో రైతులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కొయ్యలగూడెం: తుపాను ప్రభావంతో నష్టపోయిన వర్జీనియా పొగాకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు హామీ ఇచ్చారు. మిచాంగ్ తుపాను కారణంగా దెబ్బతిన్న వర్జీనియా తోటలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సీతంపేట, నరసన్నపాలెం పంచాయతీ పరిధిలోని పొగాకు తోటలలో పర్యటించి రైతుల సాధక, బాధలను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన రైతుల వివరాలు సేకరించడంతోపాటు జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదికలు ఇవ్వాల్సిందిగా వ్యవసాయ శాఖ అధికారులను, అదేవిధంగా వర్జీనియా టొబాకో బోర్డు అధికారులకు సూచించారు. ఎకరాకు దాదాపు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టామని తీరా తుపాను వలన తోటలు తుడిచిపెట్టుకుపోయాయని బాధిత రైతులు కొప్పుల వెంకటేశ్వరరావు, కొప్పులు మధుబాబు, తోటకూర శ్రీను, మధ్యాహ్నపు ఏసు, కె రామచంద్రం, మధ్యాహ్నపు సత్తిబాబు, తార్పి రెడ్డి సత్యనారాయణ, ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఓదార్చుతూ అండగా నిలబడతామని ఎమ్మెల్యే భరోసా కల్పించారు. ఏవో చెన్నకేశవులు, జెడ్పీటీసీ దాసరి శ్రీలక్ష్మి, ఎంపీపీ గంజిమాల రామారావు, వైస్ ఎంపీపీ తుమ్మలపల్లి గంగరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు తోట జయబాబు, దూలపల్లి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

టి.నరసాపురం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో డి.ముత్యాలరావు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని రైతులు వారు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నారు. క్వింటాకు సాధారణ రకం రూ.2183, ఏ–గ్రేడ్ రకం రూ.2203గా నిర్ణయించారన్నారు. కాగా ఇప్పటి వరకు మండలంలో పండించిన ధాన్యంలో 279 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు విక్రయించారన్నారు. ఇంకా సుమారు వెయ్యి మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉందని ఏవో తెలియజేశారు.

పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు



పోతునూరులో అధికారులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఆదర్ష రాజేంద్రన్

చింతలపూడి: ధాన్యం కొనుగోలులో పారదర్శకంగా వ్యవహరిస్తున్నట్లు నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్ష రాజేంద్రన్ తెలిపారు. చింతలపూడి మండలం పోతునూరు, యర్రగుంటపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులను రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంపై ఆరా తీశారు. కొనుగోలు కేంద్రాల వద్ద సంచులు అందుబాటులో ఉన్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణలో జాగ్రత్తలు పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట వ్యవసాయశాఖ ఏడీ మీనా కుమారి, ఆర్ఐ కాంతామణి తదితరులు ఉన్నారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం



వెంకటకృష్ణాపురంలో ఆటోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల: మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయమని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. మండలంలోని వెంకటకృష్ణాపురంలో స్వయం సహాయక సంఘ మహిళ లేటు విమలాదేవికి ప్రభుత్వం మంజూరు చేసిన ఆటోను ఎమ్మెల్యే తలారి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతి–మహిళా శక్తి పథకం కింద ఎస్సీ, ఎస్టీ నిరుపేద మహిళలకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి వడ్డీలేని రుణాల ద్వారా ఆటోలను మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ పథకం ద్వారా 10 శాతం లబ్ధిదారు వాటా చెల్లించగా, 90 శాతం వడ్డీలేని రుణాన్ని ప్రభుత్వం బ్యాంకుల సహకారంతో అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొండాడ మోహిని, వైస్ ఎంపీపీ యలమర్తి దుర్గాదేవి, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ చెలికాని రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, ఘంటా విఘ్నేశ్వరరావు, యలమర్తి గాంధీ, ఎలమర్తి భాస్కరచౌదరి, గోపా నాగేశ్వరరావు, మానుకొండ సుబ్బారావు, గుర్రాల లక్ష్మణ్, చెరుకూరి ప్రసాదరావు, షేక్ భాషా, మల్లెపూడి నాగమణి తదితరులున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే ఎలీజా జన్మదిన వేడుకలు



అనాథ శరణాలయం చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు అందజేస్తున్న దృశ్యం

చింతలపూడి: చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా జన్మదిన వేడుకలను శనివారం చింతలపూడిలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అనాథ శరణాలయంలో పార్టీ నాయకులు, అభిమానులు ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్‌ను చిన్నారులతో కట్ చేయించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి, పార్టీ అభివృద్ధికి ఎమ్మెల్యే ఎలీజా ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కోట్లాది రూపాయల నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. అనంతరం అనాథ శరణాలయం చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి సీహెచ్ జ్ఞానారెడ్డి, పార్టీ పట్టణ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, మండల సచివాలయాల కన్వీనర్ త్సల్లాబత్తుల శ్రీనివాసరావు, నగర పంచాయితీ సచివాలయాల కన్వీనర్ ఎస్.దుర్గారావు, ఎ సుబ్బారావు, ఎస్.కాంతారావు, ఎం.ఇమ్మానియేలు, జంగా చెన్నకేశవరెడ్డి, జగ్గవరపు శ్రీహరిరెడ్డి, కె.గోవర్ధనరెడ్డి, కె శివరామకృష్ణ, బి.చెంచమరాజు, జైపాల్, వెంకటేశ్వరరావు, బి.ప్రసాదరాజు, గోల్కొండ సురేష్, ఎస్‌కే గఫార్, దారా పేర్రాజు, దాసు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

జంగారెడ్డిగూడెం: చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పుట్టినరోజు వేడుకలను శనివారం వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెం వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి కేక్ కట్ చేశారు. రోగులకు పండ్లు, భోజనం అందచేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, మండల సచివాలయ కన్వీనర్ గురజాల పార్థసారధి, మున్సిపల్ కౌన్సిలర్లు లోకవరపు వెంకటేశ్వరరావు, ఉగ్గం దుర్గాప్రసాద్, నేకూరి కిషోర్, నాయకులు బత్తిన చిన్న, పంది రాజా, నౌడు అశోక్, కంచుమర్తి ప్రకాష్, తమ్మిశెట్టి సాయినాథ్, జహీర్, లింగగుంట శ్రీనివాస్, మునికె సత్యనారాయణ, బొజ్జ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో...

వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో మండల వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గంజి వినోద్ అధ్యక్షతన ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా జన్మదిన వేడుకలు శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా అలుగు ఆనంద శేఖర్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వెంపా ఐజి, మున్సిపల్ కౌన్సిలర్స్ నేకూరి కిషోర్, కటారి వాసు, పట్టణ యువ నాయకులు పంది రాజా, కాటం ప్రసాద్, సత్యనారాయణ, మానుకొండ కిషోర్, మల్లిపూడి రవి, సోషల్ మీడియా మండల కన్వీనర్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన



సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వార్షికోత్సవంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బాలరాజు

పోలవరం రూరల్: పోలవరం మండలం ఇటుకిలకోట పంచాయతీ పరిధిలో మండల పరిషత్ కార్యాలయం నుంచి సీసీ రోడ్డు నిర్మాణానికి పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శంకుస్థాపన చేశారు. ప్రభుత్వ కార్యాలయాల మార్గంలో ఉన్న ఈ రోడ్డును సీసీ రోడ్డుగా నిర్మించడంతో అధికార యంత్రానికి రాకపోకలకు వీలుగా ఉంటుందన్నారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణం పనులు పూర్తి చేయాలన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విద్యార్థులు విద్యతో పాటు ఆటలు, సాంస్కృతి కార్యక్రమాల్లో కూడా వారి ప్రతిభ చూపాలని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పోలవరంలోని సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్నారులు నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, సర్పంచ్ సున్న చంద్రమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ, తహసిల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను, ఎంపీటీసీలు యామల శ్రీదేవి, కుంజం చిట్టెమ్మ ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



రాజకీయ నాయకులకు ఈవీఎం యంత్రాల పనితీరుపై అవగాహన కలిగిస్తున్న ఆర్‌డీఓ అద్దయ్య

బుట్టాయగూడెం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఈవీఎంలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం ఆర్‌డీఓ అద్దయ్య నాయకులకు ఓటు వేసే విధానంపై, ఓటర్ల జాబితా తయారీపై అవగాహన కలిగించారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలో 284 పోలింగ్ స్టేషన్‌లు, 2,44,313 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. వీరిలో 1,18488 మంది పురుషులు, 1,25,815 మంది స్త్రీలు, 10 ఇతరులు ఉన్నారన్నారు. సమగ్రమైన ఓటర్ల జాబితా తయారు చేసే విధంగా కృషి చేస్తామని చెప్పారు. తహసీల్దార్‌లు ఎస్. శారాశాంతి, బి.సుమతి, ఈఓపీఆర్‌డీ శ్రీహరి, వివిధ పార్టీ నాయకులతో పాటు పలు పార్టీలకు చెందిన బూత్ కన్వీనర్‌లు పాల్గొన్నారు.

ఓటు అవగాహనపై ర్యాలీ

ప్రజాస్వామ్యంలో ఓటే ఒక బలమైన ఆయుధమని జంగారెడ్డిగూడెం ఆర్‌డీఓ అద్దయ్య అన్నారు. బూసరాజుపల్లి ఏపీ గురుకుల కళాశాల విద్యార్థినులతో ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరును నమోదు చేసుకుని ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర

జంగారెడ్డిగూడెం రూరల్: మైసన్నగూడెంలో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులను, ఉజ్వల యోజన గ్యాస్ కలెక్షన్‌లను లబ్ధిదారులకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతారామాంజనేయ చౌదరి చేతుల మీదుగా అందజేశారు. ఎంపీడీవో కె. విజయ్ ప్రసాద్, సర్పంచ్ హేమావతి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్ పాల్గొన్నారు. అలాగే వేగవరంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ లక్కాబత్తుల నాగరాజు చేతుల మీదుగా గ్యాస్ కనెక్షన్ల పంపిణీ చేపట్టారు. ఎంపీడీవో కె. విజయ్ ప్రసాద్ పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: వికసిత భారత్ సంకల్ప యాత్ర అచ్యుతాపురంలో శనివారం నిర్వహించారు. ఎంపీడీవో ఆర్ బేబీ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచ్ మద్దిపటి నాగమణి అధ్యక్షత వహించారు. సెక్రటరీ సీహెచ్ సత్యనారాయణ, బీజేపీ జిల్లా అబ్జర్వర్ వికాస్ తదితరులు పాల్గొన్నారు.

నష్టం అంచనా సర్వే పక్కాగా నిర్వహించాలి



రైతులతో మాట్లాడుతున్న జేడీ రామకృష్ణ

పోలవరం రూరల్: తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను సిబ్బంది శ్రద్ధతో సర్వే నిర్వహించాలని వ్యవసాయ శాఖ జేడీ వై.రామకృష్ణ తెలిపారు. పోలవరం, గూటాల, పట్టిసీమ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను పరిశీలించి ఇప్పటివరకు ఎంత ధాన్యం కొనుగోలు చేశారు, ఏయే మిల్లర్లకు తరలించారు అనే విషయాలను సిబ్బంది నుంచి తెలుసుకున్నారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు. తడిసిన ధాన్యం, పొడిగా ఉన్న ధాన్యం విడివిడిగా తరలించుకోవాలన్నారు. రైతులు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకుని పడిపోయిన చేలను పరిశీలించి సర్వే చేపట్టాలన్నారు. సర్వే అనంతరం రైతులు, దెబ్బతిన్న పంటల వివరాలు గ్రామసభల ద్వారా రైతులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.రాంబాబు, సొసైటీ అధ్యక్షుడు బండారు అప్పారావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దత్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి లక్షతులసి పూజ

పోలవరం రూరల్: బోడిగూడెంలో శ్రీగిరి కొండపై వెలసిన పద్మావతి, అలివేలు సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీకమాసం శనివారం లక్ష తులసి పూజ నిర్వహించారు. సామూహికంగా వేంకటేశ్వర స్వామి వ్రతాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై గిరి ప్రదక్షిణ చేశారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు బూరుగు వెంకటేశ్వరరావు కార్తీక సమారాధన నిర్వహించారు.

బుట్టాయగూడెం: కార్తీకమాసం ద్వాదశి సందర్భంగా శనివారం రాత్రి శివాలయాల్లో జ్యోతిర్లింగ దీపోత్సవం వైభవంగా జరిగింది. స్థానిక శివాలయం, రెడ్డిగణపవరం శివాలయాలల్లో జరిగిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులకు కురాకుల ఏడుకొండలు, వీర్ల సతీష్ అన్నప్రసాద వితరణ నిర్వహించారు. దాతలను ఆలయ మర్యాదలతో సన్మానించారు.

రైతులను ఆదుకోవాలి

కుక్కునూరు: ఇటీవల మిచాంగ్ తుపానుతో పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని సీపీఐఎంఎల్ ప్రజా పంథా జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ కార్యదర్శి షేక్ గౌస్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రజాపంథా కార్యాలయంలో జరిగిన సమావేశంలో గౌస్ మాట్లాడుతూ మిచాంగ్ తుపానును జాతీయ విపత్తుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలన్నారు. ప్రజాపంథానాయకులు పాల్గొన్నారు.

ఇసుక లారీ పట్టివేత

కుక్కునూరు: మండలంలోని పెదరావిగూడెం పంచాయతీ బూరుగువాయి గ్రామ సమీపంలో పాములేరు నుంచి ఇసుకను జేసీబీ ద్వారా లారీల్లో లోడ్ చేసి తెలంగాణకు తరలిస్తున్నారు. ఈ విషయమై సమాచారం అందుకున్న రెవెన్యూ సిబ్బంది వేలేరు అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని లారీలను, జేసీబీని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ బి.విద్య తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం పట్టణానికి చెందిన శేషపల్లి సీతాకుమారి ఈ నెల 8వ తేదీ ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. అప్పటి నుంచి ఇంటికి తిరిగి రాకపోవడం, చుట్టుపక్కల వెదికినా కనిపించకపోవడంతో సీతాకుమారి మరిది దూసనపూడి అజయ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు.

అగ్నిప్రమాదంలో తాటాకిల్లు దగ్ధం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం మారుమూల గ్రామమైన దిబ్బగూడెంలో శనివారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో గ్రామానికి చెందిన ఎం.మంగరాజు తాటాకిల్లు దగ్ధమైంది. ప్రమాదం జరిగిన సమయంలో మంగరాజు, కుటుంబ సభ్యులు లేకపోవడంతో ఇంట్లో ఉన్న సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. గ్రామస్తులు మంటలను ఆపే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

జంగారెడ్డిగూడెం: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం కావడంతో పట్టణంలోని రామచంద్రాపురానికి చెందిన వీఆర్‌వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ బి.విద్య తెలిపారు. శనివారం ఉదయం స్థానిక రాముడుకుంట చెరువు ప్రాంతంలో సుమారు 40 నుంచి 50 సంవత్సరాల మధ్య వయసు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని వీఆర్‌వో జి.చెల్లమ్మ గుర్తించిందన్నారు. ఆ మేరకు ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు.